క్లుప్తంగా

విద్యుత్ స్తంభం తొలగించండి


నిరుపయోగంగా పడి ఉన్న విద్యుత్ స్తంభం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారి సమీపంలో నిరుపయోగంగా పడి ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని పలువురు కోరుతున్నారు. ఎన్పీ కుంట – పెడబల్లి ప్రధాన రహదారిలో రోడ్డుకు ఆనుకొని కొన్ని నెలలుగా విద్యుత్ స్తంభం నిరుపయోగంగా పడి ఉంది. ఈ రహదారిలో రోజూ సోలార్ పవర్ ప్రాజెక్ట్‌కు మెటీరియల్ తీసుకెళ్లే హెవీ లారీలు, అధిక సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. అధికారులు స్పందించి స్తంభాన్ని తొలగించాలని వాహనదారులు, వీధి ప్రజలు కోరుతున్నారు.

బాలికా దినోత్సవంపై వక్తృత్వ,వ్యాసరచన పోటీలు

కదిరి అర్బన్: ఈ నెల 11న జరిగే అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ కదిరి ప్రాజెక్టు పరిధిలో అన్ని మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలకు ఈ నెల 10న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సీడీపీఓ రాధిక తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. బాలికలు విద్యనభ్యసించే క్రమంలో వారికి ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల రూపంలో విన్నవించవచ్చన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమతతో పాటు పలువురు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం రాత్రి ఆయన తన సిబ్బందితో కలిసి నిమ్మలకుంటలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గొడవల జోలికి వెళ్లకుండా అందరూ కలిసి మెలసి ఉండాలన్నారు. మహిళల పట్ల గౌరవభావం కలిగి ఉండాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సీసీ రోడ్ల కోసం నిరసన

కదిరి టౌన్: పట్టణంలోని 34వ వార్డు వికలాంగుల కాలనీలో సీసీ రోడ్లు వేయాలని సీపీఐ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కదిరప్ప మాట్లాడుతూ వికలాంగుల కాలనీలో ప్రభుత్వం 90 మందికి గృహాలు మంజూరు చేసిందన్నారు. అందరూ ఇళ్లు నిర్మించుకొని నివాసాలు ఉన్నారన్నారు. అయితే ఈ కాలనీకి ఇప్పటి వరకు రోడ్లు, డ్రెయినేజీ, వీధి దీపాలు వంటి ప్రాథమిక మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతురన్నాన్నారు. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ డీఈ రెడ్డమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమణ, మధునాయక్, పవన్, గంగాధర్, రవణమ్మ, రాధమ్మ, రెడ్డమ్మ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట


అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

నల్లచెరువు: కమ్మవారిపల్లిలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శివారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఎన్నారైలు మధుసూధన్‌రెడ్డి దాదెం బయపరెడ్డి, ఫణికర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అరుణ, పార్వతి, రాజశేఖర్‌రెడ్డి, కుశల్‌రెడ్డి, శరణ్యరెడ్డి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

చెన్నేకొత్తపల్లి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ కవితాదేవి అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పోషక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీఓ మాట్లాడుతూ... తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నదే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రశాంతి, లతాకిరణ్,అంగన్‌వాడీ సిబ్బంది హాజరయ్యారు.

చట్టాలపై అవగాహన

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్‌లో బుధవారం డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నారాయణరెడ్డి విద్యార్థినులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అమ్మాయిలకు ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఎండుతున్న రైతుల ఆశలు

- లోఓల్టేజీతో పనిచేయని బోర్లు
- వేపకుంటలో వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న జనం
- పట్టించుకోని విద్యుత్‌శాఖ అధికారులు

కనగానపల్లి: మండలంలోని వేపకుంట గ్రామ రైతులకు విద్యుత్ అధికారులు షాకులిస్తున్నారు. ఈ ఖరీఫ్‌లో అదునులో వరుణుడు ముఖం చాటేసినా చాలా మంది రైతులు బోరుబావుల కింద పంటలు సాగుచేశారు. అయితే కీలకమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో మోటార్లు ఆడక పంటలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా లోఓల్టేజీ వేధిస్తుండగా... పంటలు ఎండిపోతున్నాయని రైతులు, పంచాయతీ బోరుబావుల్లో పనిచేయక తాగునీరు అందటంలేదని మహిళలు వాపోతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేసినా సమస్యను పరిష్కరించటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


దెబ్బతిన్న ఆముదం పంటను చూపుతున్న వేపకుంట రైతులు

వందల ఎకరాల్లో ఎండుతున్న పంటలు

వేపకుంట గ్రామంలో బోరుబావుల కింద 500 ఎకరాల్లో ఆముదం, మల్బరీ, వరి, వేరుశనగ, పండ్ల తోటలు సాగు చేశారు. ప్రస్తుతం పంటలన్నీ కోత దశలో ఉండగా... లోఓల్టేజీ సమస్యతో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. గ్రామంలోని బోరుబావులకు పేరూరు సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయితే సబ్‌స్టేషన్ ఈ గ్రామానికి చాలా దూరంలో ఉండటంతో పాటు విద్యుత్ లైన్లు సరిగా లేకపోవటంతో సరఫరా చాలా తక్కువగా ఉంటుందని రైతులు చెపుతున్నారు. దీనివల్ల నిరంతరం లోఓల్టేజీ సమస్యలతో మోటర్లు కాలిపోయి పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఆముదం, వేరుశనగ, చీనీ తోటలు కోత దశలో ఉన్నాయని, లోఓల్టేజీ సమస్య వల్ల పంటలకు నీరు సరిగా అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక విద్యుత్ సమస్య వల్ల వారం రోజులు నుంచి పంచాయతీ బోరుబావులు కూడా ఆడకపోవటంతో తాగునీరు అందక చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలోని మహిళలు చెబుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పంటలు దెబ్బతిన్నాయి

మా గ్రామంలో బోరుబావుల కింద కూడా ఆముదం పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం పంట కాయదశలో ఉంది. ఈ సమయంలో విద్యుత్ లోఓల్టేజీ వల్ల పంటకు సరిగా నీరు అందించలేకపోతున్నాం. దీంతో చేతికి వచ్చిన పంట దెబ్బతిని దిగుబడి తగ్గిపోతోంది. అధికారులు లోఓల్టేజి సమస్యను వెంటనే పరిష్కరించాలి.

– గంగుల కృష్ణారెడ్డి, రైతు, వేపకుంట గ్రామం


సక్రమంగా నీరందక ఎండుముఖం పట్టిన చీనీ తోట

చీనీ కాయలు రాలిపోతున్నాయి

నేను బోరుబావి కింద ఐదు ఎకరాల్లో చీనీ తోట సాగుచేశా. ప్రస్తుతం పంట కాపు దశలో ఉంది. లోఓల్టేజీతో మోటర్లు సరిగా ఆడక మొక్కలకు నీరు అందించలేకపోతున్నా. దీంతో మొక్కలన్నీ ఎండిపోతూ పిందెలు కూడా రాలిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని కోరుతున్నా.

– గడ్డం నారాయణ, రైతు, వేపకుంట

త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం

వేపకుంట గ్రామానికి ప్రస్తుతం పేరూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నాం. విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉండటం.. ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం తగ్గువగా ఉండటంతో లోఓల్టేజీ సమస్య తలెత్తుతోంది. దీన్ని పరిష్కరించేందుకు ఆత్మకూరు మండలంలోని గొరిదిండ్ల సబ్‌స్టేషన్ నుంచి ఇక్కడికి విద్యుత్ సరఫరా చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం.

– కొండారెడ్డి, ఏఈ, కనగానపల్లి విద్యుత్‌శాఖ

వైభవంగా ముగిసిన పెదయ్య పరుష


పరుషలో కొలువుదీరిన స్వాములు

తాడిమర్రి: కురుబ సామాజిక వర్గం ఆధ్వర్యంలో రెండు రోజులుగా తాడిమర్రిలో జరుగుతున్న ఉత్సవాలు బుధవారం వైభవంగా ముగిసింది. పరుషలో భాగంగా బ్రహ్మ ముహూర్తాన 4 నుంచి 6 గంటల మధ్యలో పెదయ్య స్వామికి పుణ్యాహవచనం, గంగపూజ, రుద్రాభిషేకం, బిందెపూజ, మహా మంగళహారతి, బలిహారం, జల్దిపూజ తదితర పూజలు చేశారు. అనంతరం 9 గంటలకు ఘటం ఊరేగింపు, యల్లమ్మ సాగు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వరుసగా కొలువుదీరిన స్వాములకు వేలాదిగా తరలి వచ్చిన భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, మాజీ మంత్రి శంకరనారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి హాజరై స్వాములను దర్శించుకున్నారు. అనంతరం పరుష నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు ఆర్వేటి కాటమయ్య, ఆర్వేటి రామాంజినేయులు, ఆర్వేటి ఆనంద్, రామాపురం సర్పంచ్ కుంటాల పుల్లయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొంకా నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంయుక్త కార్యదర్శులకు సన్మానం


వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులను సన్మానిస్తున్న పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి, నాయకులు

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా నియమితులైన గోరకాటి పురుషోత్తంరెడ్డి, గడ్డం కుళ్లాయప్ప, పెద్దిరెడ్డి శ్రీనివాసులుకు ధర్మవరం క్లస్టర్–2 పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి ఘనంగా సన్మానించారు. తమపై నమ్మకం ఉంచి పదవుల్లో నియమించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి రాష్ట్ర సంయుక్తకార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, నాయకులు శివారెడ్డి, కోళ్లమొరం కేశవరెడ్డి, చెన్నారెడ్డి, అశోక్‌రెడ్డి, మల్లికార్జున, పెద్దన్న, దేవరపల్లి శ్రీనివాసులు, చింతా శీనా, తిరుమల్‌రెడ్డి, కుళ్లాయప్ప, సాకే శ్రీనివాసులు, ప్రశాంత్, ఆదిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, నాగార్జున, దాదు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ పోటీలకు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు రామకృష్ణప్ప, పీడీ నాగేంద్ర, నాగరాజు తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను వారు అభినందించారు. అనంతపురం అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు అండర్–14 విభాగంలో మధుసూదన్, అండర్–17 విభాగంలో పవన్‌కుమార్, అండర్–19 విభాగంలో అశోక్‌బాబు, అభినాష్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కదిరి టౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఎన్జీవో హోంలో కదిరి తూర్పు, పడమర సబ్ యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న పురుష ఆరోగ్య సహాయకులకు నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రనాయక్ హాజరై సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లు దేవలానాయక్, రామాంజనేయులు, సూపర్‌వైజర్లు మహబూబ్ బాషా, శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల సంస్కరణలపై అవగాహన

ధర్మవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ సహకార సంవత్సర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సహకార అధికారి జి.ఫణిరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రమోహన్, వెంకటేశ్వర, గొట్లూరు సొసైటీ సీఈఓ నారాయణస్వామి తదితరులు సహకార రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పలు రకాల సంస్కరణల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సహకార సంఘాల సేవలను వినియోగించుకోవాలని వారు సూచించారు.

వాల్మీకి విగ్రహం ఆవిష్కరణ


చిన్నంపేటలోని వాల్మీకి విగ్రహం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల పంచాయతీ చిన్నంపేట గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం


నిలువురాతిపల్లిలో పోషణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఓడీచెరువు (అమడగూరు) : తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి పేర్కొన్నారు. బుధవారం నిలువురాతిపల్లిలో పోషణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను, అప్పుడే పుట్టిన బిడ్డకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. కిశోరబాలికల దినోత్సవం సందర్భంగా సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈ నెల పదో తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వీరు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీకాంతమ్మ, భారతి, రామలక్ష్మమ్మ, లక్ష్మీదేవమ్మ, బేబీ, ప్రమీలమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు

ముందుకు సాగని అంగన్‌వాడీ భవన నిర్మాణం

ముదిగుబ్బ: ముక్తాపురం పంచాయతీలోని తండాలో అంగన్‌వాడీ భవన నిర్మాణం ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఈ పనులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం రాగానే పనులు నిలిచిపోయాయి. అధికారులు స్పందించి నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని తండావాసులు కోరుతున్నారు.


పూర్తికాని అంగన్‌వాడీ భవనం

వృథాగా పోతున్న తాగునీరు


రోడ్డుపాలైన నీరు

ముదిగుబ్బ: సీబీఆర్ నుంచి ముదిగుబ్బ మీదుగా కదిరి మున్సిపాలిటీకి వెళ్తున్న సత్యసాయి తాగునీటి పథకం పైపులైను దొరిగిల్లు సమీపాన పగిలి నీరు వృథాగా పోతోంది. నీరంతా రోడ్డుపక్కన నిలవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. అధికారులు స్పందించి తాగునీటి పైపులైన్‌ను మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

తనకల్లు: కేజీబీవీలో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ బాలికలు చదువుకోవడం ద్వారా సమాజంతో పాటు కుటుంబంలోనూ మంచి గౌరవం ఉంటుందన్నారు. సెప్టెంబర్‌లో పుట్టిన ప్రతి బాలికకూ గుర్తుగా ప్రతి తల్లి తన ఇంటి ముందు మొక్క నాటాలని పేర్కొన్నారు. బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి ఈ నెల 10న బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థినులతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ అబీదా, సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన డాక్టర్ జీవీ


గవర్నర్‌ను సన్మానిస్తున్న ఏపీపీఎస్సీ సభ్యుడు డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి

కదిరి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యుడు డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తోటి సభ్యులు కలిసి గవర్నర్‌కు 'కమిషన్ 2024–25' వార్షిక నివేదికను అందజేశారు. ఏపీపీఎస్సీ ద్వారా చేపట్టిన పలు కార్యక్రమాలపై గవర్నర్‌తో చర్చించినట్లు ఆయన తెలియజేశారు.

అధినేతను కలిసిన డాక్టర్ బత్తల



కదిరి అర్బన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ బత్తల హరిప్రసాద్ బుధవారం తాడేపల్లిలోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛంతో పాటు దేవుని ప్రతిమ అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అధినేత సూచించినట్లు చెప్పారు. అలాగే పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని డాక్టర్ బత్తల కలిశారు.

పెదయ్యస్వామి పూజారి మృతి


దామోదర (ఫైల్)

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కనగానపల్లి పెదయ్యస్వామి ఆలయ పూజారి దామోదర(42) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దామోదర కొన్నేళ్లుగా కనగానపల్లి పెదయ్యస్వామి పూజారిగా ఉంటూనే గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగించేవాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం గొర్రెల మంద దగ్గర నుంచి ఇంటికి వచ్చిన అతను.. ఛాతిలో నొప్పిగా ఉందని కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య పూజారమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


వితరణ చేసిన ప్లాంటు వద్ద నాటి ఉపాధ్యాయులతో నాటి విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: వారంతా దాదాపు 46 ఏళ్ల క్రితం కలిసి పదో తరగతి చదువుకున్నారు. ప్రస్తుతం వివిధ వృత్తుల్లో రాణిస్తూ ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వారంతా బుధవారం తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు ఆరా తీశారు. అనంతరం ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ అపూర్వ ఘట్టానికి చెన్నేకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. బుధవారం పాఠశాలలో 1979వ సంవత్సరంలో పదో తరగతి చదివిన వారిలో 30 మంది కలిశారు. పాఠశాలలో తాము చేసిన అల్లరిని, ఉపాధ్యాయుల బెత్తం దెబ్బలను తలచుకుని నవ్వుకున్నారు. అనంతరం తమకు చదువుచెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు రూ.1.30 లక్షల విలువ చేసే వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఓబుళమ్మతో పాటు పలువురు పూర్వ విద్యార్థుల పాల్గొన్నారు.

భారీ వర్షంతో ఉపశమనం


టీచర్స్ కాలనీకి వెళ్లే దారిలో మోకాలులోతు నిలిచిన వర్షపు నీరు

బత్తలపల్లి: మండలంలో రెండు రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిపోయిన ప్రజలకు బుధవారం భారీ వర్షంతో ఉపశమనం లభించినట్లయింది. సాయంత్రం వర్షంతో పాటు భారీగా ఉరుములు, మెరుపులు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వర్షం వల్ల వీధులన్నీ జలమయమయ్యాయి. బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీలోకి వెళ్లే దారిలో మోకాలు లోతు నీరు నిల్వ ఉండడంతో ఆ దారి వెంట వెళ్లేందుకు ప్రజలు సాహసించలేదు. నీరంతా వెళ్లిన తరువాత ప్రజలు ఆ దారి గుండా వెళ్లారు. టమాట రైతులు ఆందోళనకు గురయ్యారు. అరటి, వరి, వేరుశనగ, కంది పంటలకు ప్రయోజనం ఉంటుందని రైతులు తెలిపారు.

13 వరకు బ్యాంక్ సేవలు బంద్

ముదిగుబ్బ: బ్యాంకుల విలీనం కారణంగా ఈ నెల 13 వరకు మండల కేంద్రం ముదిగుబ్బలోని అనంత గ్రామీణ బ్యాంకు సేవలు నిలిపివేస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ అజయ్‌సింహారెడ్డి బుధవారం తెలిపారు. ఖాతాదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

కదిరి టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో గంజాయి, మట్కా, లాటరీ కేసుల్లో రౌడీషీట్ నమోదైన దాదాపు 20 మందికి సీఐ వి.నారాయణరెడ్డి బుధవారం పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. భవిష్యత్‌లో ఎటువంటి నేరాలకూ పాల్పడకుండా కౌన్సెలింగ్ ఇచ్చి, మండల మేజిస్ట్రేట్ అయిన తహసీల్దార్ మురళీకృష్ణ వద్ద సత్ప్రవర్తనతో ఉండేందుకు ఒక సంవత్సర కాలానికి రూ.5 లక్షల పూచికత్తు తీసుకున్నారు. నేరాలకు పాల్పడితే తప్పనిసరిగా జైలుకు వెళ్లాలన్నారు.

విద్యుత్ సమస్యలుంటే ఫోన్ చేయండి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్, చంద్రబాబునగర్, కేశవనగర్, శారదానగర్, బత్తలపల్లి రోడ్డు తిక్కస్వామి నగర్, సంజయ్‌నగర్, శివానగర్ ఏరియాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే 73826 05344 నంబర్‌కు ఫోన్ చేయాలని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

కబ్జాపై తిరగబడ్డ కాలనీవాసులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని చేదబావి వీధి సమీపాన హైవేకి సంబంధించిన ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జా చేస్తుండటంతో కాలనీవాసులు తిరగబడ్డారు. అక్కడ తాగునీటి పథకానికి అమర్చిన స్విచ్ బోర్డును ఆన్ అండ్ ఆఫ్ చేయడానికి కూడా స్థలం లేకుండా కబ్జా చేస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సర్పంచ్ లక్ష్మీదేవి, చంద్రాయుడు దంపతుల దృష్టికి తీసుకెళ్లడంతో.. వారు కబ్జాపై అధికారులకు ఫిర్యాదు చేశారు.

పాఠకుల సంఖ్య పెంచాలి

ధర్మవరం: గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సంఖ్య పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. బుధవారం పట్టణంలోని బాబు జగజ్జీవన్‌రామ్‌నగర్‌లోని ప్రధాన గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పాఠకుల సంఖ్య పెంచి, గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడాలని గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతికి సూచించారు.


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ